క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్:ఘట్‌కేసర్ 33/11కేవీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఘట్‌కేసర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. శాంతినగర్, అంబేడ్కర్ నగర్, కుమ్మరిబస్తీ, టీచర్స్ కాలనీ, బ్రూక్‌బాండ్ కాలనీ, బుగ్గానగర్, సాయిరాం నగర్ కాలనీలో మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తైబజార్ వేలం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ రుసుము వసూలు చేసేందుకు మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేలం పాట నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ స్వామి తెలిపారు. ఈమేరకు తైబజార్‌లో పాల్గొనేవారు రూ.లక్ష చొప్పున చెల్లించి వేలం పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు



బస్‌పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ ఆర్టీసీ అధికారులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామంలోని దివ్యాంగుల కోసం సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్‌పాస్ మేళాను సోమవారం నిర్వహించారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అర్హులైన వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఆంజనేయులు, టీఎస్ ఆర్టీసీ మార్కెటింగ్ అధికారులు నరేందర్‌గౌడ్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించిన 'శ్రీనిధి'

పోచారం: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.28.28 లక్షల ఆస్తిపన్నును శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం సోమవారం చెల్లించింది. వాహనాల రాకపోకలతో గాలిలో దుమ్మూ, ధూళి వ్యాపించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందున సీసీ లేదా బీటీ రోడ్డు వేయాలని చైర్మన్ కొండల్‌రెడ్డి కోరడంతో కాలేజీ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



జవహర్‌నగర్‌లో పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్‌తో రాష్ట్రాభివృద్ధి జరిగిందని జవహర్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జీవో–58 కింద మంజూరైన పట్టాలను సోమవారం జవహర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో–58 ద్వారా పేదింట్లో వెలుగులు నింపుతుందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్, రంగా, శ్రీమన్నారాయణ, వెంకటేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కుతాడి నరేందర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు చలివేంద్రంలోని నీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, గ్రామ సర్పంచ్ గణేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు రాజమల్లారెడ్డి, హరత్‌రెడ్డి, వార్డు సభ్యులు పద్మావతి, భిక్షపతి, కృష్ణవేణి, లక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మేడిపల్లి: ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. 23వ డివిజన్ న్యూసాయినగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం రెండో విడత చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మేనేజర్ జ్యోతిరెడ్డి, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవాలయం



మహాపూర్ణాహుతి కార్యక్రమం



వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



దేవస్థానంలో కొలువైన శ్రీస్వామివారు

- లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు
- వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి పంచదశ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు స్వామి సన్నిధిలో వేదపండితులు విశేష పూజలను నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమాలు, అనంతరం చక్రస్నానం, మహాపూర్ణాహుతి, అలంకరణ, పంచహారతులు, నివేదన, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం, పల్లకీసేవ, పవళింపు సేవ తదితర పూజాకార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు యాదాద్రి ప్రధాన అర్చకులు నల్లందీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. చివరి రోజు పూజల్లో ఆలయ చైర్మన్ దంపతులు మల్లారపు లక్ష్మీనారాయణ, ఇందిరా, ధర్మకర్త శ్రీహరిగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నక్క ప్రభాకర్‌గౌడ్, శివలింగాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చక్రస్నానంలో ఆలయ చైర్మన్ దంపతులు

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల పర్వం నిత్యం కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. కేవీ రెడ్డి నగర్ పరిధిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. మరికొందరు అనుమతులు పొందినా నిబంధనలకు నీళ్లు చల్లుతూ ఇష్టానుసారంగా ఇళ్లు, కమర్షియల్ నిర్మాణ పనులు సాగిస్తున్నారు. కేవీ రెడ్డి నగర్ పరిధిలో గతంలో అసైన్డ్ భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టి పట్టాలు పొందిన వారు సైతం ప్రస్తుతం ఆ నిర్మాణాలను కమర్షియల్‌గా మారుస్తున్నారు. స్థానిక కౌన్సిలర్ అక్రమ నిర్మాణాలపై అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోవడం లేదని, అక్రమ నిర్మాణాలను నియంత్రించడం లేదని విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి



కలెక్టర్‌కు మొక్కనిస్తున్న సర్పంచ్

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. గ్రామంలో చేపడుతున్న, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు సర్పంచ్ తెలిపారు.

వధువుకు పుస్తె మెట్టెలు



మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన గిరిధర్‌గౌడ్ కుమార్తె మానికకు పెళ్లి నిశ్చయం అయ్యింది. పేద కుటుంబం కావడంతో మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి స్పందించి ఆమెకు పుస్తె మట్టెలతో పాటు వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆమెను ఆశీర్వదించారు.

అవుషాపూర్‌లో అధికారుల పర్యటన

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామాన్ని మిషన్ భగీరథ అధికారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నీటి సమస్యలపై సర్పంచ్‌తో సమీక్ష నిర్వహించారు. గోల్డెన్ వ్యాలీ, కేపాల్ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని అధికారులను సర్పంచ్ కావేరి కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నర్సింహులు, డీఈఈ మహేందర్, ఏఈఈలు రాహుల్, హరిని, నాయకులు మహేందర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ అధికారుల సమీక్షలో అవుషాపూర్ సర్పంచ్ కావేరి

నియామకం



కిరణ్ కుమార్

పోచారం: పోచారం పురపాలక సంఘం తరఫున న్యాయపరమైన కోర్టు కేసులు పరిష్కరించేందుకు స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా ఊటుకూరి కిరణ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సోమవారం ఆయన కమిషనర్ సురేష్‌కు జాయినింగ్ రిపోర్టును సమర్పించారు.

నూతన్‌కల్‌లో క్రికెట్ టోర్నమెంట్



బహుమతులు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మేడ్చల్: బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఉషిగారి బాబు ఆధ్వర్యంలో మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బీఆర్‌ఎస్ మండల నాయకులు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో నూతన్‌కల్ పరిసర గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నమెంట్ విజేతలకు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, నాయకులు యూనుస్‌పాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితరత్నకు సత్కారం



అశోక్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్: దళిత రత్న అవార్డు పొందిన ఎమ్మార్పీఎస్ కళామండలి జాతీయ అధ్యక్షుడు ఎన్వై అశోక్‌ను మేడ్చల్‌లో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌ను నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పరశురాం, నాయకులు సుదర్శన్, బాలనర్సింహ, శివకుమార్ తదితరులున్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. సాక్ ఆధ్వర్యంలో ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం పాల్గొని రంజాన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ముస్లిం విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో రంజాన్ గొప్పదనాన్ని చాటారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, సాక్ డీన్ రామదాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

మేడ్చల్: రంజాన్ సందర్భంగా ముస్లింలకు ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ కానుకలను మేడ్చల్‌లో కౌన్సిలర్ కౌడె మహేష్ మైనార్టీ నాయకులతో కలిసి అందజేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తోఫాలు అందజేశారు. కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌అలీ, బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు లాయక్ అలీ, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



రంజాన్ వేడుకల్లో యాజమాన్యం, విద్యార్థులు



రంజాన్ తోఫాలు అందజేస్తున్న కౌన్సిలర్ మహేష్

రమాదేవికి నివాళి



కీసర: గుండెపోటుతో మృతి చెందిన కీసర ఎంపీడీఓ రమాదేవి చిత్రపటానికి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. వైస్‌ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, ఎంపీఓ మంగతయారు, సూపరింటెండెంట్ హంథాని, ఎంపీటీసీ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, పండుగ కవిత, జూపల్లి వెంకటేష్, మండల వ్యవసాయాధికారి మాధవీలత, గ్రామకార్యదర్శులు, సర్పంచులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకు పగడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తీసుకువచ్చే రైతుల కోసం షామియానాలు, తాగునీరు, కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యాన్ని ఎఫ్ఎక్యూ ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ ఏరోజుకారోజు పూర్తిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు వరకు లారీల కొరత ఏర్పడకుండా చూడాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీక్లినర్లు, తేమశాతం కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మిల్లర్లు ఎఫ్ఎక్యూ ప్రమాణాల విషయంలో ఇబ్బందులు సృష్టించవద్దన్నారు. కేంద్రాలకు వచ్చే ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో డీసీఎంస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, డీసీఓఓ శ్రీనివాస్, డీఎస్ఓ తనుజా, డీఎంసీఎస్ రాజేందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రమాదేవి మృతి బాధాకరం..

కీసర ఎంపీడీవో రమాదేవి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో ఎంపీడీఓ రమాదేవి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యా నాయక్, డీఆర్‌డీఏ పద్మజారాణి, డీసీఓ శ్రీనివాస్ మూర్తి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో 83 ఫిర్యాదులు..

ప్రజావాణిలో భాగంగా జిల్లాలో వివిధ సమస్యలపై 83 ఫిర్యాదులు అందినట్లు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యా నాయక్, డీఆర్డీఏ పద్మజారాణితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులకు సంబంధించిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు

10 మంది పందెం రాయుళ్లపై కేసు

మేడ్చల్‌రూరల్: వారాంతపు సెలవు దినం కావడంతో నగరానికి చెందిన పందెం రాయుళ్లు నగర శివారు మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలో కోడి పందేలు సాగిస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి 10 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. నగరంలోని నిజాంపేట్‌కు చెందిన వీఆర్‌వీ రాజు, మహేశ్, నాగచైతన్య, పృథ్వీరాజ్, బాచుపల్లికి చెందిన సత్యనారాయణ, కొంపల్లికి చెందిన రామక్రిష్ణ, సాయిరాంవర్మ, ఎస్‌సీఎల్‌కు చెందిన శ్రీనివాస్‌రావు, మియాపూర్‌కు చెందిన వర్మ, కూకట్‌పల్లికి చెందిన వంశీరాజ్ ఆదివారం సాయంత్రం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి పూడూర్ గ్రామ శివార్లలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కోడిపందెలు సాగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు సాయంత్రంసమయంలో స్థావరంపై దాడులు నిర్వహించారు. 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.25 లక్షలు, 10 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, ఆరు పందెం కోళ్లు, నాలుగు కోడి కత్తులను స్వాధీనం చేసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రధాన రహదారి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న మేయర్ మేకల కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మేయర్ మేకల కావ్య అధ్యక్షతన హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు, కాంట్రాక్టర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను ఆదర్శమైన కార్పొరేషన్‌గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. జవహర్‌నగర్ అభివృద్ధి పనుల కోసం మంత్రి కేటీఆర్ రూ.30 కోట్లు మంజూరు చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిల ఆదేశాల మేరకు ప్రధాన రహదారి పనులను వేగవంతం చేసి 20 రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీఎల్ డీఈఈ, మున్సిపల్ డీఈఈ మురళి, ఏఈ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కోసం..

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి ధ్రువపత్రాలు అందజేశారు. అభయ ఫౌండేషన్ సౌకర్యంతో సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టుమిషన్లు ఏర్పాటు చేయగా వాటిని గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్ గీతభాగ్యరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, ఎంపీటీసీ హేమలత, ఉపసర్పంచ్ సత్యనారాయణ, నాయకులు భాగ్యరెడ్డి, యూనుస్, రమోదర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్, రాంచందర్, ప్రవీణ్, గంగారాం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



డబీల్‌పూర్‌లో కుట్టుమిషన్లు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానికులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మేడపాటినగర్‌లో ఇళ్ల మధ్యన సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని కోరుతూ వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నరసింహారెడ్డికి సోమవారం వినతి అందజేశారు. సెల్ టవర్ నిర్మాణంతో సమీపంలో ఉన్న తెలుగు, ఉర్దూ మీడియం స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, గర్భిణులు రేడియేషన్‌తో అనారోగ్యం పాలవుతారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి సెల్ టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలని కోరారు. అదనపు కలెక్టర్‌కు వినతి అందజేసిన వారిలో మాజీ వార్డు సభ్యురాలు మీనా, జగదీశ్, వేణు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఏఐఎఫ్‌బీ సభ్యులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతి నగర్‌లో ప్రారంభించిన హెర్బల్ పార్కు స్థలాన్ని కాపాడాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరుంధతినగర్‌లో మూడు సంవత్సరాల క్రితం మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా హెర్బల్ పార్కును ప్రారంభించి, సంరక్షణను మర్చిపోయారని, ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడిందని కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జవహర్‌నగర్‌లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ కాప్రా మండల కార్యదర్శి రుద్రవెల్లి బబ్లు, మంగళంపల్లి తిరుపతి, కోడూరి శ్రణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.